క్లుప్తంగా

పంటలు ఈక్రాప్ నమోదు చేయించాలి



త్రిపురాంతకం మండలం కేశినేనిపల్లి రైతులకు పంటలపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

త్రిపురాంతకం: రైతులు పండించే పంటలను వ్యవసాయ సహాయకులచే ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి బీ సంగమేశ్వరరెడ్డి తెలిపారు. త్రిపురాంతకం మండలం గొల్లపల్లి, కేశినేనిపల్లి గ్రామాల్లో ఈక్రాప్ నమోదుపై అవగాహన కల్పించారు. ఫసల్‌బీమా యోజన, ఇతర ఇన్సూరెన్స్ పథకాల ద్వారా లబ్ధిపొందే అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ లక్ష్మీదేవి, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించేందుకు నేడు తుది గడువు



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ బాలక్రిష్ణనాయక్

దొనకొండ: గ్రామాల్లోని రైతులు వారు సాగు చేసిన పంటలకు బీమా ప్రీమియం కట్టుకునేందుకు ఆగస్టు 14 వరకు మాత్రమే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి వి.బాలక్రిష్ణనాయక్ తెలిపారు. మండలంలోని రామాపురం, లక్ష్మీపురం గ్రామాల్లో రైతులు సాగుచేసిన పొలాలను బుధవారం ఆయన పరిశీలించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ డబ్బులు పడని వారు వెంటనే తమ సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ–పంట నమోదు ప్రారంభమైందని, పంట వేసుకున్న రైతులందరూ ఈ–పంటలో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హెచ్‌ఎం, తోటి ఉపాధ్యాయులు

దర్శి: బదిలీపై వివిధ పాఠశాలలకు వెళ్లిన పోతవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు ఈ బసంతి, ఖాసీం, కల్పనను బుధవారం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందపల్లి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పోతవరం హైస్కూల్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు మాధవి, వెంకటేశ్వర్లు, వీరాంజనేయులు, మధుబాబు, పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్‌ల పాలనతో ఇక్కట్లు

- ఎంపీడీవో, ఏవో ఇద్దరూ ఇన్‌చార్జిలే
- కీలక శాఖలు ఖాళీగా ఉండడంతో ప్రజలకు తప్పని అవస్థలు



ఎంపీడీవో కార్యాలయం

పుల్లలచెరువు: మండలంలో ముఖ్యమైన పరిపాలన శాఖల్లో కీలకమైన రెండు శాఖలకు అధికారులు లేకపోవడంతో ఇన్‌చార్జ్‌లే దిక్కయ్యారు. ప్రధాన శాఖల్లో పూర్తి స్థాయి అధికారులు లేకపోవడంతో పాలన వ్యవహారాల్లో జాప్యం ఏర్పడుతోంది. ఇటీవల జరిగిన బదిలీల్లో మండల వ్యవసాయాధికారిని బదిలీ చేయడంతో ఆ పోస్టులో రెగ్యులర్ అధికారి రాక ఇన్‌చార్జ్‌ని నియమించారు. అదేవిధంగా ఎంపీడీవోగా పనిచేస్తున్న వసంతరావు నాయక్ సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో యర్రగొండపాలెం ఎంపీడీవో ను ఇన్‌చార్జ్‌గా నియమించారు.

పంటలను పట్టించుకునేవారేరి:

ప్రస్తుతం గ్రామాల్లో ఖరీఫ్ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. అరటి, వరి, పత్తి, బొప్పాయి, సజ్జ, మొక్కజొన్న పంటలు సాగు చేశారు. అధికారుల పర్యవేక్షణ తక్కువగా ఉండడంతో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చే వారు కరువయ్యారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండలంలో తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొని రైతులకు సూచనలు ఇవ్వాల్సి ఉండగా ఎంత మంది ఆ కార్యక్రమానికి హాజరవుతున్నారో వారికే తెలియాలి. ఏవోతో పాటు వీఏఏ, ఎంపీఈవోలు అనేక మంది కేవలం కార్యాలయాలకే పరిమితమవుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. రెగ్యులర్ అధికారి ఉంటే కొంతలో కొంత మార్పు వస్తుందని ప్రజలు అంటున్నారు.

పారిశుధ్యం, సచివాలయాలపై పర్యవేక్షణ ఏదీ:

రెగ్యులర్ ఎంపీడీవో లేకపోవడంతో ఇన్‌చార్జ్ ఎంపీడీవో కార్యాలయానికి వారంలో ఒక రోజు చుట్టం చూపుగా వచ్చిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. గ్రామాల్లో పారిశుధ్యం, సచివాలయాల తనిఖీ, ఉపాధి హామీ పనులు పర్యవేక్షణ లేకపోవడంతో అధ్వాన్నంగా తయారయ్యాయి. గ్రామాలు కంపుకొడుతున్నాయి. ఇటీవల వర్షాలు పడడంతో గ్రామాల్లో నీరు నిల్వ చేరి అపరిశుభ్రత తాండవిస్తోంది. మండలంలో ఉపాధి పనులపై పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమయ్యారు. కూలీలకు సక్రమంగా ఉపాధి అందడం లేదు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థల పనితీరుపై తీవ్రంగా విమర్శలు ఉన్నా తనిఖీ చేసే వారు లేరు. అనేక పనులకు కార్యాలయానికి వచ్చినప్పుడు రెగ్యులర్ ఎంపీడీవో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెగ్యులర్ ఏవోను, ఎంపీడీవోను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

రెగ్యులర్ అధికారులను నియమించాలి



రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక పనుల కోసం కార్యాలయానికి వచ్చే వారికి కనీస సమాధానం చెప్పేవారు కరువయ్యారు. రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. జిల్లా అధికారులు స్పందించి రెగ్యులర్ అధికారులను నియమించాలి. జిల్లా అధికారుల అలసత్వంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

– జి.గురునాథం, సీపీఐ మండల కార్యదర్శి

ఆలయ నిర్మాణానికి సహకరిస్తా



ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

- దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

తాళ్లూరు: మండలంలోని బెల్లంకొండవారిపాలెం గ్రామంలో ఏకలవ్యనగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త దేవరకొండ పెద్ద సుబ్బారావు సతీమణి సంతోషమ్మ, ఏకలవ్యకాలనీ వాసుల ఆహ్వానం మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి బుధవారం గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యేకి కాలనీ వాసులు పూలతో ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. నూతన గృహంలో సత్యనారాయణస్వామి వారికి బూచేపల్లి కొబ్బరికాయ కొట్టారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో టీటీడీ ఆధ్వర్యంలో ఏకలవ్య వాసుల కులదైవం అంకమ్మ తల్లి దేవస్థానం నిర్మించారు. అయితే నిర్మాణం కొంతమేరకు మిగిలిపోవడంతో ఆ పనులు పూర్తి చేసేందుకు సహకరిస్తానని, కాలనీ వాసుల కల నెరవేరుస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. బూచేపల్లి వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు గువ్వల శ్రీనివాసరెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు జగన్నాథం సురేష్, నియోజకవర్గ ప్రచార విభాగం అధ్యక్షుడు యత్తపు మధుసూదన్‌రెడ్డి, నాయకులు అంజిరెడ్డి, గోపు శ్రీను, నారాయణరెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, దేవరకొండ వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, మధు, ప్రశాంత్, సూరిబాబు, రామయ్య, ఏకలవ్య కాలనీ వాసులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి తోడ్పాటునందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య

పెద్దారవీడు: మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు బాధ్యతగా పని చేస్తూ ప్రజా ప్రతినిధులకు సరైన గౌరవం ఇవ్వాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేస్తే గ్రామాల్లో అభివృద్ధి పనులు సక్రమంగా సాగుతాయన్నారు. జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి మాట్లాడుతూ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందించాలని కోరారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఏఈ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గొబ్బూరు, చట్లమిట్ల గ్రామాల్లో పూర్తైన రైతు సేవా కేంద్రాల భవనాలను ప్రారంభించాలని, ప్రస్తుతం అద్దె భవనాల్లో ఉన్నాయన్నారు. కలనూతల ఎంపీటీసీ దూదేకుల పకీరయ్య మాట్లాడుతూ ఎంపీటీసీలకు ఇవ్వాల్సిన గౌరవ వేతనం ఇంత వరకు ప్రభుత్వం విడుదల చేయలేదని అన్నారు. ఎంపీడీఓ జాన్ సుందరం మాట్లాడుతూ ఎంపీటీసీల గౌరవ వేతనం విడుదల చేస్తే మీ బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారని చెప్పారు. రామాయపాలెం సర్పంచ్ పొందుగుల వెంకటరెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం భవనం అసంపూర్తిగా ఉందని త్వరలో పూర్తి చేయాలన్నారు. మూడు నెలలకు ఒక సారి జరిగే సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు డుమ్మా కొట్టడం పరిపాటిగా మారింది. సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడంలేదని సర్పంచులు, ఎంపీటీసీలు ధ్వజమెత్తారు. కార్యక్రమంలో డీటీ రామకృష్ణ, ఎంఈఓలు శ్రీనివాసులు, సుబ్రమణ్యం, ఏఓ లక్ష్మీనారాయణ, డాక్టర్ జగదీష్, ఏఈ నాగేంద్రరెడ్డి, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు ఎం లక్ష్మిదేవి, ఎస్ అంజమ్మ, ఏపీఎం కృపమ్మ, ఆర్టీసీ అధికారి శ్రీనివాసులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వర్షం కురిస్తే పల్లెలు చిత్తడే



చిత్తడిగా ఉన్న గురిజేపల్లి బీసీ కాలనీ రోడ్డు



వైపాలెంలోని గాయత్రి థియేటర్‌కు వెళ్లే సీసీ రోడ్డు పరిస్థితి ఇది

యర్రగొండపాలెం: వర్షాకాలంలో పల్లెలు చిత్తడిగా మారిపోతున్నాయి. సైడ్ కాలువలు లేకపోవడంతో కురిసిన వర్షం రోడ్లపైనే నిలబడి ప్రజలను ఇబ్బందికి గురిచేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రధాన వీధులు మట్టి రోడ్లు కావడంతో చిన్నపాటి వర్షం కురిసినా అవి బురదమయంగా మారిపోతున్నాయి. ఈ రోడ్లపై నడిచేందుకు పాదచారులు, వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని గురిజేపల్లి బీసీ కాలనీకి వెళ్లే దారి పూర్తిగా బురదమయం అయింది. కాలనీతో పాటు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, సచివాలయానికి వెళ్లే వారు ఈ రోడ్డు నుంచే నడవాల్సి వస్తోంది. స్కూల్‌కు వెళ్లే పిల్లల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కొంతమంది తమ పిల్లలను బురదలో బయటికి వెళ్లనీయకుండా ఆ రోజు బడి మాన్పిస్తున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. యర్రగొండపాలెం పట్టణంలో పుల్లలచెరువు రోడ్డు నుంచి గాయత్రి థియేటర్‌కు వెళ్లే దారి పూర్తిగా సిమెంట్ రోడ్డు. ఆ ప్రాంతంలో డ్రైనేజి లేకపోవడంతో రోడ్డుపైనే మోకాలు లోతులో వర్షం నీరు నిలువ చేరుతోంది. ఒక్కసారి వర్షం కురిస్తే ఆ రోడ్డులో దాదాపు 15 రోజుల పాటు మురికిమయంగా ఉంటుందని, వెంటనే అధికారులు స్పందించి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

సాగర్ భూముల అన్యాక్రాంతంపై సర్వే

- డిప్యూటీ కలెక్టర్ కళావతి ఆదేశం



త్రిపురాంతకం సాగర్ బారువేరియా భూములు పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్, అధికారులు

త్రిపురాంతకం: ఎన్ఎస్‌పీ బారువేరియా భూములు అన్యాక్రాంతం అయ్యాయని తమ భూములు గుర్తించి హద్దులు చూపించాలని సాగర్ అధికారులు జిల్లా రెవెన్యూ అధికారులను కోరడంతో డిప్యూటీ కలెక్టర్ కళావతి పరిశీలించి పూర్తి స్థాయి సర్వే జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. త్రిపురాంతకం పరిసరాల్లోని సాగర్ కాలనీలకు చెందిన కోట్లాది రూపాయల విలువైన బారువేరియా భూములు ఉన్నాయి. ఇవి అన్యాక్రాంతం అవుతుండటంతో బుధవారం రెవెన్యూ, సాగర్ అధికారులు పరిశీలించారు. స్థానికంగా మేజర్ల పక్కన ఉన్న భూముల వివరాలు సేకరించారు. రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మార్చి అమ్మేసిన బారువేరియా భూములను, త్రిపురాంతకం బ్రహ్మంగారికాలనీలో ఉన్న భూములను పరిశీలించారు. వాటిలో కొన్ని నివాస స్థలాలుగా, మరికొన్ని భూముల్లో స్థిర నివాసాలు ఉండడంతో వాటిని పరిశీలించారు. కొంత మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. వీటన్నింటినీ పరిశీలించిన అనంతరం వాటిపై సమగ్రంగా సర్వే నిర్వహించి పూర్తి స్థాయి నివేదిక తయారు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆ భూముల్లో ఉంటున్న వారి వివరాలతో నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించాలని కళావతి ఆదేశించారు. ఈమె వెంట జిల్లా సర్వేయర్ గౌస్ బాషా, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సాగర్ కాలువల ఈఈ రామకృష్ణ, డీఈఈ విజయలక్ష్మి, సర్వేయర్ సైదారావు, రెవెన్యూ, సాగర్ కాలువల సిబ్బంది ఉన్నారు.

పెద్దారవీడు ఎస్ఐగా సాంబశివయ్య



పెద్దారవీడు: పెద్దారవీడు పోలీసు స్టేషన్‌కు నూతన ఎస్ఐగా సాంబశివయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఒంగోలు సీసీఎస్ నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ అనిల్‌కుమార్‌ను ఒంగోలు వీఆర్‌కు బదిలీ చేశారు.

ఉద్యానవన పంటలతో అధిక లాభాలు

కురిచేడు: నీటి వసతి ఉన్నటువంటి రైతులు ఉద్యానవన పంటలు సాగు చేయడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయాధికారి బి.సంపత్ కుమార్ తెలిపారు. కురిచేడు మండలంలోని కురిచేడు, పేరంబొట్లపాలెం గ్రామాల్లో సాగుచేసిన పొగాకు పంటను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు నల్లబర్లీ పొగాకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలైన కంది, పెసర, మినుము, సజ్జ పంటలు సాగుచేయాలని తెలిపారు. కంది పంట వేసే రైతులు అంతర పంటగా సజ్జతో కలిపి వేయడం వలన అధిక ఆదాయంతో పాటు నేలలోని పోషకాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవచ్చని, భూసారాన్ని పెంచవచ్చని తెలిపారు. ఈ సంవత్సరం నుంచి ప్రతి సర్వే నంబరులో జియో ట్యాగింగ్ ద్వారా తప్పనిసరిగా పంట నమోదు చేయడం జరుగుతుందన్నారు. పంట వేసిన రైతులు నమోదు చేయించుకోవాలని సూచించారు. కౌలుకు సాగు చేసే రైతులు గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి కౌలు కార్డు తీసుకోవాలన్నారు. ఖరీఫ్‌లో నోటిఫైడ్ పంటలు సాగుచేసిన రైతులు బీమా కట్టుకోవడానికి చివరి తేదీ ఆగస్టు 14 అని తెలిపారు. కూరగాయలు సాగు చేసిన రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా హెక్టారుకు రూ.24,000 సబ్సిడీ అందించడం జరుగుతుందన్నారు. బిందు సేద్యం, తుంపర సేద్యం కావాల్సిన వారు గ్రామ రైతు సేవా సేవా కేంద్రంలోని అధికారులను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ సహాయకురాలు జి.మేరీ, వ్యవసాయ సహాయకురాలు సాయి చరిత, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

దర్శిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

దర్శి: బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం దర్శి పట్టణంలో జాతీయ జెండాలతో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎస్‌వీఆర్ కళాశాల విద్యార్థులతో కలిసి జాతీయ జెండాలు చేతబూని వందే మాతరం, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. బీజేపీ దర్శి నియోజకవర్గ అధ్యక్షుడు మాడపాక శ్రీనివాసులు, దర్శి రూరల్ మండలాధ్యక్షుడు కాకర్ల నాగసాయి, పట్టణ అధ్యక్షుడు అమరేశ్వరరావు, యువమోర్చా నాయకుడు కె.రామాంజనేయులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసు సిబ్బంది

తాళ్లూరు: మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ చేయూత నివ్వాలని హెడ్ కానిస్టేబుల్ రమేష్, దారా బ్రహ్మనాయుడు కోరారు. స్థానిక వీకే ఉన్నత పాఠశాలలో బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇన్చార్జి ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అధ్యక్షత వహించి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో లెక్చరర్లు గురవయ్య, రాజశేఖర్, లక్ష్మయ్య, సాయి లక్ష్మి, లలితా బోస్, పార్వతి బాయ్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలి

పుల్లలచెరువు: అల్పపీడన ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మట్టి మిద్దెల్లో ఉండే వారు రాత్రి సమయంలో వేరే చోట నివాసం ఉండాలన్నారు. చెరువులు, కుంటలు తెగిపడేలా ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. వీఆర్వోలు గ్రామాల్లో పర్యటించి సమాచారం తమకు తెలియచేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

సరస్వతి దేవి విగ్రహావిష్కరణ



ముటుకుల పాఠశాలలో సరస్వతిదేవి విగ్రహం

పుల్లలచెరువు: మండలంలోని ముటుకుల గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో దాతల సహకారంతో బుధవారం చదువుల తల్లి సరస్వతి దేవి విగ్రహాన్ని ఎంపీపీ వెంకటయ్య ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన ఉప్పాల చిన్న కొండలు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ ఉపాధ్యాయులతో పాటు గ్రామ పెద్దలు బొల్లేపల్లి సాంబయ్య, శేషయ్య, గద్దె వెంకటేశ్వర్లు, గ్రంధిశిల కోటేశ్వరరావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి

యర్రగొండపాలెం: ప్రత్యేక అవసరాలున్న దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గుమ్మా రాజయ్య బుధవారం కోరారు. ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటి వరకు 50 శాతం రాయితీతో పాసులు ఇస్తున్నారని, దీనిని నూరు శాతం రాయితీకి పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. రెండు కళ్లులేని అంధులకు, రెండు కాళ్లు లేని దివ్యాంగులకు సహాయకుడిగా వచ్చే వారికి రాయితీ కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.